క్లుప్తంగా

నేడు షటిల్ టోర్నీ ప్రారంభం

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లిలో శనివారం నుంచి వానరసేన సంక్రాంతి షటిల్ టోర్నీ ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంటు పల్లపువీధి రామాలయం సెంటర్‌లో కొత్త సచివాలయం సమీపంలో ఉన్న క్రీడా స్థలంలో మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ టోర్నీలో విజేతకు ప్రథమ బహుమతిగా రూ.6 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలను అందించనున్నట్లు తెలిపారు.

రేపు అయ్యప్పస్వామి జ్యోతి దర్శనం

కొత్తపల్లి: మకర సంక్రాంతి సందర్భంగా స్థానిక ధర్మశాస్తా ఆలయంలో జ్యోతి దర్శనం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామి వారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేయనున్నట్టు తెలిపారు. సాయంత్రం మకర సంక్రాంతి జ్యోతి దర్శన ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

రైల్వే ట్రాక్ మరమ్మతులు ప్రారంభం



సామర్లకోటలో చేస్తున్న రైల్వే ట్రాక్ మరమ్మతులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో శుక్రవారం ట్రాక్ మరమ్మతు పనులు ప్రారంభించారు. ప్రత్యేకంగా విజయవాడ నుంచి వచ్చిన ట్రాక్ రెన్యువల్ ట్రైన్‌తో పట్టాలను పైకి లేపి స్లీపర్లను ఏర్పాటు చేశారు. స్థానిక దక్షిణ కేబిన్ నుంచి ప్లాట్‌ఫాం చివరి వరకు రెండో నంబర్ ట్రాక్ పనులు పూర్తి చేశారు. రెండో నెంబరు లైన్‌లో పనులు సందర్భంగా రైళ్ల స్పీడ్‌ను తగ్గించారు. ఈ పనులను అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీరు బి శివప్రసాద్, స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, సీనియర్ సెక్షన్ ఇంజినీరు తీర్థకాశీ తదితరులు పర్యవేక్షించారు.

యథేచ్ఛగా బెల్టు షాపులు

కొత్తపల్లి: మండలంలో బెల్ట్ షాపులు పెరుగుతున్నాయి. 18 గ్రామ పంచాయతీలకు సంబంధించి వందకు పైగా బెల్ట్ షాపులు ఉన్నట్లు సమాచారం. కొనపాపపేట, నాగులాపల్లి, యండపల్లి జంక్షన్, గోర్స, కొమరగిరి, ఇసుకపల్లి తదితర గ్రామాల్లో ప్రధాన కూడలి కిళ్లీ షాపుల్లో వీటిని నిర్వహిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వస్త్రదానం



సామర్లకోట లయన్స్ క్లబ్‌లో పేదలకు వస్త్రదానం చేసిన ప్రతినిధులు

సామర్లకోట: స్థానిక శ్రీ భీమేశ్వర-సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం వస్త్రదానం చేశారు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద సేవా సంస్థగా గుర్తింపు పొందిన లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మిల్వేన్ జోన్స్ జయంతిని పురస్కరించుకొని స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా మిల్వేన్ జోన్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ రీజియన్ ప్రతినిధులు చిత్తూలూరి వీర్రాజు, కర్రి ఆదినారాయణరెడ్డి, మర్తాల విజయభాస్కర రెడ్డి, క్లబ్ అధ్యక్షురాలు ఎస్ సుధారాణి, మాజీ అధ్యక్షుడు గుండు శంకరరావు, మేకా శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

లలితా సహస్రనామ సంకీర్తన



పోటీల్లో లలితా సహస్రనామాలు ఆలపిస్తున్న చిన్నారి

పిఠాపురం: గొల్లప్రోలు పాదాలమ్మ గుడి వద్ద సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన లలితా సహస్రనామ సంకీర్తన పోటీలు శ్రోతలను అలరించింది. సుమారు 66 మంది పోటీల్లో పాల్గొని లలితా సహస్రనామాలను ఆలపించారు. న్యాయ నిర్ణేతలుగా వేద పండితులు దిభాష్యం సుబ్రహ్మణ్యశర్మ, ఎ.శ్రీనివాసశర్మ, రంగసాయి శర్మ వ్యవహరించగా ఆలయ కమిటీ ఈపోటీలను నిర్వహించింది.

19న దంత వైద్య శిబిరం

కాకినాడ సిటీ: ది కాకినాడ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సంఘం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంఘ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ఈనెల 19వతేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సంఘం ప్రధాన కార్యాలయంలో డెంటల్ మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణ మూర్తి శుక్రవారం తెలిపారు.

సందడంటే సంక్రాంతే..

- ఊరూ వాడా పెద్ద పండగ శోభ
- భోగి మంటలకు ఏర్పాట్లు పూర్తి
- ఇంటింటా అతిథులతో హడావుడి



భోగిమంటలకు దుంగలు సేకరిస్తున్న యువకులు



సామర్లకోటలో రంగవల్లులు, భోగిపళ్ల కోసం విక్రయానికి సిద్ధంగా ఉంచిన రంగులు, రేగుపళ్లు



సామర్లకోటలో భోగి దండలు తయారు చేస్తున్న దృశ్యం



విక్రయానికి సిద్ధంగా ఉన్న పిడకలు

కొత్తపల్లి: ఎప్పుడెప్పుడు పండుగ.. ఏడాది పండుగ, అల్లుడు ఎందుకు వచ్చాడు.. అరిసెలు తినడానికి.. కూతురు ఎందుకు వచ్చింది.. కుడుములు తినడానికి.. చింతచెట్టుపై దెయ్యం.. మాకేం బయ్యం.. అనే పాటలతో గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. చిన్నారులు రాగయుక్తంగా పాడుతూ గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ కట్టెలు, పిడకలను దండుతూ భోగిమంటకు సిద్ధమవుతున్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో పిల్లలు భోగిపండుగకు కట్టెలు సేకరించారు. ఇందుకోసం పిల్లల చిలిపి దొంగతనాలు జోరందుకున్నాయి. కొందరు ఆకతాయిల పిల్లలు, ఇళ్లముందు, ఆరు బయట, దుకాణాల్లో ఉండే చిన్న చిన్న కర్రలు, కట్టెలను దొంగతనంగా సేకరించడం పెద్దలకు చిరుకోపాలు రప్పిస్తున్నాయి. మరో వైపు ఇళ్ల ముంగిళ్లు రంగవల్లులతో పండగను స్వాగతిస్తున్నాయి. మరో వైపు కోడిపందేలకు బరులు సిద్ధమవుతున్నాయి. ఎన్ని నిబంధనలున్నా ఎవరిదారి వారిదే అన్నట్టు ఏర్పాట్లు చకచకా సాగిపోతున్నాయి.

భోగి మంటలకు ఏర్పాట్లు పూర్తి

సామర్లకోట: సంక్రాంతి పండగకు స్వాగతం పలికే భోగి పండగను ఘనంగా జరుపుకోవడానికి మండలవాసులతో పాటు పట్టణ ప్రజలు ఏర్పాట్లు పూర్తి చేశారు. భోగి పండగను పురస్కరించుకొని భోగి మంటలను వేయడానికి పిల్లలు, పెద్దలు పొలాల్లోకి వెళ్లి ఎండిన కర్రలు, పట్టెలు, తాడిచెట్లను సిద్ధం చేశారు. భోగి పండగ రోజున ఐదేళ్ల లోపు చిన్నారులకు భోగి పండ్లు వేస్తారు. తలస్నానం చేయించి కొత్త బట్టలు వేసుకున్న చిన్నారులకు తలపై రేగుపళ్లు, పూలరేకులు, చిల్లర నాణేలతో వేయడం సంప్రదాయం. భోగి మంటల్లో భోగి దండలను వేయడానికి పిల్లలు సిద్ధమయ్యారు. భోగి పండగను పురస్కరించుకొని పట్టణ పరిధిలోని అన్ని వార్డులు, గ్రామాల్లో మంటలు వేయడానికి ఏర్పాట్లు చేశారు. ఆవు పిడకల దండలు గతంలో రైతులు ఉచితంగా పిల్లలకు ఇచ్చే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేక ఆవుపిడకల దండలను కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది.

గోదా కల్యాణానికి ఏర్పాట్లు



ప్రత్యేక అలంకరణలో పిఠాపురం కుంతీమాధవస్వామి వారు

పిఠాపురం: భోగి పండుగ సందర్భంగా వివిధ వైష్ణవాలయాల్లో గోదా కళ్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక కుంతీమాధవస్వామి, కొత్తపల్లికి చెందిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయాలలో గోదాదేవి కల్యాణాలు నిర్వహించనున్నారు. నియోజకవర్గ పరిధిలో కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో వివిధ వైష్ణాలయాల్లోనూ ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. అలాగే వివిధ దేవాలయాల్లోనూ సంక్రాంతి సందర్భంగా శనివారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

కోడి పందేలకు బరులు సిద్ధం



సామర్లకోట మండలంలో కోడి పందేలకు సిద్ధమైన బరులు



పందేలకు సై అంటే సై అంటున్న కోళ్లు

సామర్లకోట: సంక్రాంతి అనగానే కోడి పందేలపై ప్రతి ఒక్కరూ దృష్టి సారిస్తారు. ఈ మేరకు కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఎస్పీ సంక్రాంతికి సంప్రదాయ క్రీడలు నిర్వహించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కోడి పందేలు, జూదం వంటి క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు కూడా. ఏటా సంక్రాంతి మూడు రోజులు కోడి పందేలు రివాజుగా జరగడంతో నియోజకవర్గ పరిధిలో అనేక గ్రామాల్లో కోడి పందేలకు సంబంధించి బరులను సిద్ధం చేస్తున్నా రు. కొన్ని గ్రామాల్లో రెండు వర్గాలు ఉండడంతో రెండు బరులు ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలో పెద్దాపురంలో కట్టమూరు, పులిమేరు, గుడివాడ, చంద్రమాపంపల్లి, దివిలి, ఆర్బీ కొత్తూరు, జె.తిమ్మాపురం గ్రామాల్లో కోడి పందేలకు బరులు సిద్ధమయ్యాయి. అదే విధంగా సామర్లకోట మండల పరిధిలో వేట్లపాలెం, జి.మేడపాడు, కొత్తూరు, ఉండూరు, వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాల్లో బరులు సిద్ధం చేసి జనరేటర్లతో లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

పందెం.. మాంసం కోసమే

పిఠాపురం: కోడి పందేలు కాయడం ఒక ఎత్తయితే.. ఓడిన కోడి మాసం (కోస) సొంతం చేసుకోవడం ఒక ఎత్తు. దీని ఖరీదు వేలల్లో ఉంటుంది. పోరాడి విజయం సాధించి తమ యజమానికి రూ.లక్షల్లో ఆదాయాన్ని తెచ్చిపెట్టే పందెం కోడి.. వీరమరణం పొందినా రూ.వేలల్లో చచ్చిన తరువాత రూ వేలల్లో ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. ఏనోట విన్నా 'డబ్బులు వద్దు.. ముందు కోస పంపించు' అన్నదే వినిపిస్తోంది. రూ.కోట్లలో పనులు చేయించుకోవాలంటే కోస పంపితే చాలు అంటున్నారు. దీనికోసం ఆరాటపడనివారు ఉండరంటే అతిశయోక్తికాదు. తొలిరోజు భోగి నాడు ప్రారంభమైన కోడిపందాల్లో వందల కోళ్ల పందెంలో ఓడిపోగా వందల కిలోల కోస మాంసం ఎందరికో సొంతం కానుంది. కిలో కోస మాంసం రూ.500 నుంచి రూ.1000 వరకు పలుకుతుంది. పందెంలో ఓడిన కోడి ఎక్కువగా దెబ్బతినక పోతే మళ్లీమళ్లీ పందెం కాస్తుంటారు. చివరకు అది చనిపోతే దానిని కాల్చి తరువాత కోసిన మాంసంను వండుకుంటారు. ఈమాంసం కొవ్వు లేకుండా అత్యంత రుచిగా బలవత్తరంగా ఉంటుంది. దీంతో ఎక్కువ మంది దీని కోసం అర్రులు చాస్తుంటారు.

పెంపకం వల్లే విలువ

పందెం కోళ్లను కొన్ని నెలల పాటు బాదం, పిస్తా, జీడిపప్పు వంటి బలవర్ధకమైన ఆహారంతో పాటు ప్రతీ రోజు వ్యాయామం చేయిస్తూ పెంచుతారు. దీంతో కండలు తేరి ఎక్కడా కొవ్వు లేకుండా ఉండడం వల్ల ఈ మాంసం రుచి ఎక్కువ. వీటి ఎముకలను మాంస ప్రియులు ఇష్టంగా తింటారు.

పట్టణ పరిశుభ్రతలో శానిటరీ సిబ్బందిదే కీలకపాత్ర



శానిటరీ వర్కర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

పెద్దాపురం: పట్టణ అభివృద్ధిలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి అన్నారు. సంక్రాంతి సందర్భంగా శానిటరీ వర్కర్లు ఏటా ఇచ్చే నూతన వస్త్రాలను శుక్రవారం వారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మన్, వైస్ చైర్మన్లు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ అవార్డు పొందామంటే పట్టణ పరిశుభ్రతకు వర్కర్లు చేస్తున్న పారిశుధ్య పనులేనన్నారు. సిబ్బంది పట్టణంలో మరింత పరిశుభ్రత పాటించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు మాట్లాడుతూ మున్సిపాలిటీలో సుమారు 47 మంది సిబ్బందికి నూతన వస్త్రాలు, సబ్బులు, నూనె వంటి సామగ్రి అందజేస్తున్నామన్నారు. అనంతరం తులసీ మంగతాయారు, సాయిప్రసాద్‌ల చేతుల మీదుగా శానిటరీ సిబ్బందికి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఆయా వార్డుల కౌన్సిలర్లు, సిబ్బంది, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన పెంచండి



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెద్దాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని పెద్దాపురం ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ఆయా పంచాయతీ కార్యదర్శులతో ఈఓపీఆర్‌డీ మూర్తి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హిమమహేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, మంచి నీటి సరఫరా, ఇంటి పన్ను వసూలు, ప్రజావసరాలు తీర్చడంలో పంచాయతీ కార్యదర్శులు మరింత మెరుగైన సేవలందించాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి శ్రీనివాస్, జూనియర్ సహాయకులు జగన్నాధం, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఊపందుకున్న రబీ సాగు



నాట్లు పూర్తయిన వరిపొలం

పిఠాపురం: ఈ ఏడాది ఖరీఫ్ సాగు పూర్తవ్వడంతో రబీ సాగుకు అన్నదాత సమాయత్తమవుతున్నాడు. శనివారం నుంచి మూడు రోజుల పాటు సంక్రాంతి నేపథ్యంలో వ్యవసాయ పనులకు విరామం ఇవ్వనున్నారు. వారం రోజులుగా నియోజకవర్గంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. నియోజకవర్గం పల్లపు భూములతో పాటు మెట్ట ప్రాంతం కలిగి ఉంది. ఏలేరు, పీబీసీ ఆయకట్టు పరిధిలో 40వేల ఎకరాల్లోనూ, చెరువుల కింద 7 వేల ఎకరాల్లో వరి వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే నీరు అనుకున్న స్థాయిలో అందుతుండడంతో అన్ని ప్రాంతాల్లో నాట్లకు సిద్ధమయ్యారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు 95 శాతంపైగా నారు మళ్లు వేసే పనులు పూర్తవ్వగా 50 శాతంకు పైగా నాట్లకు నారు సిద్ధమైంది. పీబీసీ శివారు ప్రాంతాల్లో సాగునీటి ఎద్దడి లేక పోవడంతో రైతులు నాట్లు వేగవంతం చేసారు. ఈ నెలాఖరుకు 90 శాతంకు పైగా నాట్లు పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థలో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం

కాకినాడ సిటీ: పంచాయతీరాజ్ వ్యవస్థను రాష్ట్రం నుంచి జిల్లా, మండల స్థాయి వరకు అనుసంధానం చేస్తూ ఎప్పటికప్పుడు సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని కలుగు జేసింది. దీనిలో భాగంగా మొట్టమొదటిసారిగా శుక్రవారం కాకినాడ జిల్లా పరిషత్ నుంచి ట్రైల్ రన్‌ను ప్రారంభించారు. జిల్లా పరిషత్‌లో ఈ వీడియో కాన్ఫరెన్స్ కోసం ఓ ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి శుక్రవారం జిల్లాలోని 62 ఎంపీడీవో కార్యాలయాలు, ఆరు డీఎల్‌డీవో, 4 డీపీవో కార్యాలయాలను అనుసంధాన ప్రక్రియను జెడ్పీ సీఈవో ఎన్ వీవీ సత్యనారాయణ నిర్వహించారు. అదే విధంగా రాష్ట్రం నుంచి ప్రిన్సిపల్ కార్యదర్శి గోపాలకృష్ణద్వివేది, కమిషనర్ కోన శశిధర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఈ వీడియో కాన్ఫరెన్స్ ట్రైల్ రన్‌లో పాల్గొని అధికారులతో సమీక్షించారు. గతంలో ఎంపీడీవోలు తహసీల్దార్ కార్యాలయాలకు, జెడ్పీ సీఈవో, డీపీవోలు కలెక్టరేట్‌కు వెళ్లి వీడియో కాన్ఫరెన్స్‌ల్లో పాల్గొనేవారు. ఇప్పుడు నేరుగా ఆయా అధికారులు తమ కార్యాలయాల నుంచే ఈ వీడియో కాన్ఫరెన్స్‌ల్లో పాల్గొనే అవకాశం కలిగింది.

మద్యం లేని సంక్రాంతిని స్వాగతిద్దాం



తాటిపర్తిలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న నాయకులు

పిఠాపురం: సంక్రాంతి పండుగను మద్యంతో కాకుండా సంస్కృతి, సంప్రదాయబద్ధంగా స్వాగతించాలని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, జన విజ్ఞాన వేదిక నాయకులు సూచించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో శుక్రవారం మద్యం లేని మద్యం లేని సంక్రాంతిని జరుపుకుందాం మన సంస్కృతిని మనసారా స్వాగతం అంటు ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు మద్యం వల్ల కలిగే నష్టాలను అవగాహనా కల్పించారు. మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, జన విజ్ఞాన వేదిక నాయకులు ఎస్.సూర్యనారాయణ, జి.ప్రసాద్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తా

- పెద్దాపురం ఎస్‌ఐ సురేష్ బాధ్యతల స్వీకరణ



పెద్దాపురం: పెద్దాపురం సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వెలుగుల సురేష శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ ట్రాఫిక్ ఎస్‌ఐగా పని చేస్తున్న సురేష్ ఇక్కడికి బదిలీపై రాగా ఇప్పటి వరకు విధులు నిర్వర్తించిన ఎస్‌ఐ టి.శివకుమార్ కాకినాడకు వీఆర్‌కు వెళ్లడంతో ఆయన స్థానంలో సురేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సురేష్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. తాను ప్రపథమంగా సబ్ డివిజన్‌లోని జగ్గంపేట, గండేపల్లితో పాటు జిల్లాలోని మండపేట, రాయవరం, పెదపూడి, కాకినాడ ట్రాఫిక్ ఎస్‌ఐగా పనిచేసి బదిలీపై వచ్చానన్నారు. సబ్ డివిజన్‌లో ఉన్న పరిచయాలతో ప్రజలకు మంచి సేవలందిస్తానని ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

రెవెన్యూ అంశాల్లో ప్రగతి చూపండి: ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని జగనన్న, శాశ్వత భూహక్కు, భూరక్షకు సంబంధించి రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూహక్కు పత్రాల పంపిణీ వేగవంతం చేయాలని ఆర్డీవో బీవీ రమణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకినాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కాకినాడ నుంచి రాజానగరం వరకు నిర్మించ తలపెట్టిన భారతమాల జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ ధ్రువపత్రాలు సకాలంలో మంజూరు చేయాలని ఆదేశించారు. పండగల నేపథ్యంలో ఏవిధమైన కోడిపందేలు, జూద క్రీడలు జరగకుండా పోలీసు వారితో సమన్వయం చేసుకోవాలని అదే విధంగా కొత్త సినిమాల విడుదల నేపథ్యంలో టికెట్లకు ఏ విధమైన బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా థియేటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అదే విధంగా సినిమా థియేటర్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ పరిపాలనాధికారి వరహాలయ్య, తహసీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

కిటకిటలాడిన సామర్లకోట రైల్వే స్టేషన్



ప్రయాణికులతో కిటకిటలాడిన సామర్లకోట రైల్వే స్టేషన్

సామర్లకోట: జిల్లాకు ముఖ్య జంక్షన్ సామర్లకోట రైల్వే స్టేషన్ ప్రయాణికులతో శుక్రవారం కిటకిటలాడింది. సంక్రాంతి సందర్భంగా వివిధ పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న వారు గ్రామీణ ప్రాంతాల్లోని స్వగ్రామాలకు చేరుకొంటున్నారు. సికింద్రాబాద్, విజయవాడ, బెంగళూరు, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చేరుకోవడానికి సామర్లకోట జంక్షన్‌కు ప్రయాణికులు వెళతారు. సామర్లకోట నుంచి కాకినాడ, జగ్గంపేట, పిఠాపురం, ప్రత్తిపాడు, కిర్లంపూడి తదితర ప్రాంతాలకు తరలి వెళ్లారు. దాంతో సామర్లకోటకు రైలు వచ్చిన సమయంలో రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడింది. రెండో శనివారం సెలవు కావడం ఆదివారం కలిసి రావడంతో అనేక మంది వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. శనివారం భోగి, ఆదివారం సంక్రాంతి, సోమవారం కనుమ పండగను ప్రజలు జరుపుకొంటున్నారు.

పెంచిన వాహన పన్నుకు వ్యతిరేకంగా ధర్నా



ఆర్టీఓ సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వాహన పన్నుకు వ్యతిరేకంగా పెద్దాపురం సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వాహన తనిఖీ అధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు నాయకులు డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ లారీ, ఆటో, బస్సు ఇతర వాహనాలు నడుపుతూ ఎంతోమంది జీవనం సాగిస్తున్నారన్నారు. ఇప్పటికే పెట్రోల్, డీసెల్ ధరల పెంపుతో ఇబ్బందులు పడుతున్న వారికి జీఓ నంబర్ 21 వల్ల అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పెంచిన ట్యాక్స్ వల్ల రవాణా రంగం మరింత సంక్షోభంలో కూరుకుపోనుందని, ప్రభుత్వం తక్షణమే వాహన పన్ను పెంపు విరమించుకోవాలన్నారు. అనంతరం రవాణాశాఖాధికారి సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గడిగట్ల సత్తిబాబు, మీసాల శ్రీను, దాడి నాగేశ్వరరావు, మల్లికార్జునరావు, నీలపాల సూరిబాబు, తాడిశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు.

మాండవ్య నారాయణస్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు



మాండవ్యనారాయణస్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు చేస్తున్న మహిళలు

సామర్లకోట: స్థానిక అతి పురాతన విష్ణాలయమైన శ్రీ మాండవ్యనారాయణస్వామి ఆలయంలో ఉత్తరాషాఢ పూజలు శుక్రవారం జరిగాయి. దీనిలో భాగంగా మహిళలతో సామూహిక వత్రాలు నిర్వహించారు. ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా గత నెల 16 నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పారిశ్రామిక వేత్త బిక్కిన పరమేశ్వరసాయి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, చిన్నవీధి, పెద్దవీధి, నీలమ్మచెరువు, యార్లగడ్డవారి వీధి, దేవీచౌక్ మీదుగా గ్రామోత్సవం ఆలయానికి చేరింది. ధనుర్మాస పూజా కార్యక్రమాల ముగింపును పురస్కరించుకొని శనివారం ఉదయం ఆలయంలో గోదా కల్యాణం నిర్వహిస్తున్నారు. ఈ కల్యాణంతో ధనుర్మాస పూజలు ముగుస్తాయని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణ మూర్తి తెలిపారు.

సంస్కృతి సంప్రదాయాల సమాహారం శిల్పారామం

కాకినాడ రూరల్: వాకలపూడి సాగరతీరంలోని శిల్పారామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని చీఫ్ విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.శ్యామ్‌సుందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 14 నుంచి 16వ వరకు మూడు రోజులపాటు వివిధ సంస్కృతి, సంప్రదాయాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కాకినాడ శిల్పారామం ఇన్‌చార్జ్ పరిపాలనాధికారి మోహన్ తేజ తెలిపారు. 14వ తేదీ శనివారం సాయంత్రం 5 నుంచి రాత్రి ఏడు గంటల వరకు శృతిలయ సంగీత నాట్యాలయం వారిచే కూచిపూడి, భరతనాట్యం నృత్య ప్రదర్శన, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. అలాగే 15వ తేదీ ఆదివారం భారతితో కూచిపూడి, భరతనాట్యం నృత్య ప్రదర్శన, చిన్నారులకు గాలిపటాల పోటీ నిర్వహించనున్నట్టు తెలిపారు. 16వ తేదీ సోమవారం చిరంజీవి వారిచే బుర్రకథ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.